నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నమ్మలేని నిజాలు**

తాకట్లో తల
అప్పు తెలాకొంతట
ఔను నిజమా!

ఇటుక బట్టి
మట్టికాలితెగట్టి
జీవిత సత్యం.

కర్ఫ్యూ మొదలు
దయ్యం తిరుగుతుంది
దయ్యం కథలు.

కంకి కంచె
నూరిన కొడవళ్లు
పేదలభుక్తి

శుభాభి హోళి
రంగుల వసంతాలు
పండిన కల.



- రేడియమ్
సెల్: 9291527757


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**శ్రీనిజాలు**

కేసీఆర్ కె పాజిటివ్
వచ్చిందంటె కరోనా!
సామాన్యునికేమి దిక్కు
ఇంటా బయటా రోనా !

పద్దెనిమిదేళ్ల పైబడి
నోళ్లు తీస్కోండి టీకా!
కరోనా కనబడకుండ
పారిపోవు టకాటకా !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ | గురువారం 22-4-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 218 | పేజీలు: 6 | వెల: రూ.1/-

## ఆక్సిజన్ ట్యాంకర్ లీకైన ఘటనలో

# 22 మంది మృతి



నాసిక్, ఏప్రిల్ 21: : కరోనా వేళ పెను విషాదం చోటుచేసుకున్నది. ఆక్సిజన్ ట్యాంకర్ లీకైన ఘటనలో 22 మంది రోగులు మృతిచెందారు. నాసిక్‌లోని డాక్టర్ జకీర్ హుస్సేన్ హాస్పిటల్ వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకున్నది. ఆక్సిజన్ ట్యాంకర్ నుంచి సిలిండర్లలో ఆక్సిజన్ నింపుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఘటనా స్థలం వద్ద ఉన్న అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. లీకవుతున్న ఆక్సిజన్‌ను అదుపు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కరోనా వైరస్ కేసులు విజృంభిస్తున్న విషయం తెలిసిందే. దీంతో క్రిటికల్ పేషెంట్లకు ఆక్సిజన్ అవసరం వస్తున్నది.

లీకేజీ ఘటనతో సుమారు 30 నిమిషాల పాటు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయింది. బాధితులంతా వెంటిలేటర్లపై ఆధారపడి ఉన్నారు.

వాళ్లకు నిరంతరం ఆక్సిజన్ సరఫరా చేయాల్సి ఉంటుంది. సుమారు 150 మంది రోగులు ఆక్సిజన్‌పై ఆధారపడి ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ ఘటనపై శీఘ్ర స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు మంత్రి రాజేశ్ తోప్ తెలిపారు.

నాసిక్‌లో జరిగిన ఘటన దురదృష్ట కరమని, ప్రాథమిక సమాచారం మేరకు 22 మంది మరణించినట్లు తెలుస్తోందని, ఈ ఘటన గురించి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరిస్తున్నామని, దీని పట్ల దర్యాప్తునకు ఆదేశించామని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి డాక్టర్ రాజేంద్ర షింగానే తెలిపారు.

## అది గుండెను పిండేసే విషాదం: ప్రధాని మోదీ

ముంబై, ఏప్రిల్ 21: మహారాష్ట్రలోని నాసిక్ పట్టణంలోగల జకీర్ హుస్సేన్ ఆస్పత్రిలో ఆక్సిజన్ ట్యాంకర్ లీక్ కావడంతో ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగుల్లో 22 మంది ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. కాగా, ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఆ దుర్ఘటన గుండెను పిండేసే అంతటి విషాదకర ఘటన అని ప్రధాని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర మనోవేదన కలిగించిందని ట్వీట్ చేశారు. ఇలాంటి విషాద ఘడియలో మృతుల కుటుంబాలకు తాను ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని తెలిపారు.

## ఇది తెలంగాణ విజయం.. కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, ఏప్రిల్ 21: : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త జోనల్ విధానాన్ని కేంద్రం ఆమోదించడం సంతోషకరం అని మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. కొత్త జోనల్ విధానానికి ఆమోదం పొందడం తెలంగాణ విజయం అని అన్నారు. ప్రభుత్వ నియామకాల్లో స్థానికులకే 95 శాతం ఉద్యోగాలు దక్కనున్నాయి. కొత్త జోనల్ విధానంతో యువత న్యాయమైన వాటా పొందొచ్చు అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# భద్రాద్రిలో వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం





భద్రాచలం, ఏప్రిల్ 21: : భద్రాచల క్షేత్రంలో శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. సరిగ్గా పన్నెండు గంటలకు జిలకర్ర, బెల్లం పెట్టారు. అనంతరం మాంగళ్యధారణ జరిగింది.

ఈ కమనీయ వేడుక రామ భక్తుల్ని ఆనంద పారవశ్యంలో ముంచెత్తింది. రాములోరి కల్యాణానికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్ దంపతులు సమర్పించారు. కరోనా మహమ్మారి వల్ల భక్తజనుల సందడి లేకుండానే కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఇవాళ కల్యాణం ముగియడంతో రేపు శ్రీరామచంద్రుడి పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం జరగనుంది. కొవిడ్ కారణంగా పూజలు, తీర్థ ప్రసాదాలు నిలిపివేశారు.

ఈ వేడుకల్లో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య దంపతులు, జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఎస్పీ సునీల్ దత్, జేసీ కర్నాటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బాలసాని, ఎండోమెంట్ కమిషనర్ అనీల్ కుమార్ దంపతులు, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తెల్లం వెంకట్రావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

## నాసిక్ ఘటనపై అమిత్‌షా దిగ్భ్రాంతి..

# మృతుల కుటుంబాలకు సంతాపం

ముంబై, ఏప్రిల్ 21: : నాసిన్‌లోని డాక్టర్ జకీర్ హుస్సేన్ హాస్పిటల్లో ఆక్సిజన్ ట్యాంకర్ లీకై ప్రాణవాయువు అందక 22 మంది రోగులు మృతిచెందిన ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

**ఘటన దురదృష్టకరం : ఆరోగ్యశాఖ మంత్రి**

నాసిక్ ఘటనపై అమిత్ షాగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు సంతాపం

నాసిన్ ఘటన దురదృష్టకరమని మహారాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి రాజేశ్ టోపే అన్నారు. పరిస్థితిపై నాసిక్ మున్సిపల్ కమిషనర్ మాట్లాడానని, ప్రస్తుతానికి అంతా అదుపులోనే ఉందని ఆయన పేర్కొన్నారు.

తాను నాసిక్ బయల్దేరి వెళ్తున్నట్లు తెలిపారు. స్థానిక మంత్రి చాగన్ భుజ్‌బల్ ఇప్పటికే ఘటనాస్థలానికి చేరుకున్నారని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని మంత్రి రాజేశ్ టోపే చెప్పారు.

# ప్రముఖ కవి శంఖ ఘోష్ కరోనాతో కన్నుమూత



కోల్‌కతా, ఏప్రిల్ 21: : ప్రముఖ బెంగాలీ రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత శంఖ ఘోష్ కొవిడ్-19తో కన్నుమూశారు. కొద్ది రోజులుగా తన నివాసంలో ఐసొలేషన్‌లో ఉంటున్న ఘోష్.. ఇవాళ ఉదయం తుదిశ్వాస విడిచినట్టు ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. 89 ఏళ్ల ఆయన ఈ నెల 14న కరోనా బారిన పడ్డారు. వైద్యుల సూచనల మేరకు స్వీయ గృహనిర్బంధంలో ఉన్నట్టు ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. వివిధ ఆరోగ్య సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురైన ఘోష్‌కు కొద్ది నెలల క్రితం ఓ ఆస్పత్రిలో చికిత్స అందించారు. 1932 ఫిబ్రవరి 6న చంద్‌పూర్‌లో ఘోష్ జన్మించారు. ప్రస్తుతం ఇది బంగ్లాదేశ్‌లో ఉంది.

"ఆదిమ్ లాటా-గుల్మోమే", "ముర్ఖా బారో, సమాజిక్ నాయ్ " సహా ఇతర పుస్తకాలు ఘోష్‌కు విశేష గుర్తింపు తెచ్చిపెట్టాయి. పలు సామాజిక, రాజకీయ అంశాలపై పదునైన విమర్శకుడిగా పేరున్న ఆయనకు 2011లో పద్మ భూషణ్ అవార్డు వచ్చింది. 2016లో ఆయనను జ్ఞానపీఠ్ అవార్డు వరించింది. 1977లో తాను రాసిన "బాబర్ ప్రార్థన" గ్రంథానికి గానూ ఆయన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఆయన రాసిన గ్రంథాలు హిందీ, ఇంగ్లీష్ సహా పలు భాషల్లోకి అనువాదం అయ్యాయి.

## కరోనా సెకండ్ వేవ్ మోదీ సృష్టించిన విపత్తు: మమతాబెనర్జి

కోల్‌కతా, ఏప్రిల్ 21: : పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి మరోసారి ప్రధాని నరేంద్రమోదీపై నిప్పులు చెరిగారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా దక్షిణ దినాజ్‌పూర్ జిల్లాలోని బాలూర్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడిన ఆమె.. ప్రస్తుతం దేశంలో కరోనా మహమ్మారి విజృంభించడానికి ప్రధాని నరేంద్రమోదీయే కారణమని ఆరోపించారు. కరోనా సెకండ్ వేవ్‌ను మోదీ సృష్టించిన విపత్తుగా అభివర్ణించారు.

దేశంలో కరోనా సెకండ్ వేవ్ చాలా తీవ్రంగా ఉన్నది. నేను దీన్ని మోదీ సృష్టించిన విపత్తే అంటాను. ఆస్పత్రుల్లో సరిపడా ఇంజెక్షన్‌లు లేవు. ఆక్సిజన్‌కూ కొరతే ఉన్నది. దేశంలో ఇలాంటి విపత్కర పరిస్థితులు ఉన్నా కరోనా టీకాలను, ఔషధాలను మాత్రం విదేశాలకు తరలించారు అని మమతా బెనర్జి వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో మళ్లీ బెంగాల్ ఇంజిన్ ప్రభుత్వమే ఏర్పాటవుతుందని, మోదీ డబుల్ ఇంజిన్ గవర్నమెంటుకు అవకాశమే ఉండదని ఆమె పేర్కొన్నారు.

# వారంలోగా 4 లక్షల రెమిడెసివిర్ ఇంజక్షన్లు : మంత్రి కేటీఆర్

హైదరాబాద్,ఏప్రిల్ 21:: ప్రభుత్వ ఆసుపత్రులకు వారంలోగా 4 లక్షల రెమిడెసివిర్ ఇంజక్షన్లు అందేలా చూస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. బుధవారం రెమిడెసివిర్ ఉత్పత్తిదారులతో మంత్రి కేటీఆర్ చర్చలు జరిపారు. సీఎం ఆదేశాల మేరకు ఉత్పత్తిదారులతో చర్చించినట్లు మంత్రి తెలిపారు.

రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతుండటంతో రెమిడెసివిర్ ఇంజక్షన్ల కొరత పెరిగింది. వైరస్ సోకి శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు తలెత్తుతున్న వారికి వైద్యులు ఆక్సిజన్‌తోపాటు రెమిడెసివిర్ ఇంజక్షన్‌లను ఇస్తున్నారు.

ఫలితంగా వైరస్ లోడ్ తగ్గి రోగులు త్వరగా కోలుకుంటున్నట్టు చెబుతున్నాయి. ఇటీవల ఆస్పత్రుల్లో చేరుతున్న రోగుల సంఖ్యతోపాటే రెమిడెసివిర్ ఇంజక్షన్ల వినియోగం సైతం పెరిగింది.

ఉత్పత్తి తగ్గడం.. చాలాచోట్ల ఇంజక్షన్లు లభించకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఉత్పత్తి పెంచాలని తయారీ సంస్థలతో మంత్రి కేటీఆర్ ఇవాళ చర్చలు జరిపారు.



# తెలంగాణ ప్రజలను కాపాడుకుంటాం : మంత్రి ఈటల



కరీంనగర్. ఏప్రిల్ 21:(నేటినిజం ప్రతినిధి): కరోనా నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఎన్ని వందల కోట్ల రూపాయాలైనా ఖర్చు పెట్టి తెలంగాణ ప్రజలన కాపాడుకుంటాం అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో ఉన్నారని తేల్చిచెప్పారు.

హుజురాబాద్ మండలంలో కన్నుల పండువగా జరిగిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కరోనా కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా సీతారాముల కల్యాణోత్సవం వేడుకలు నిరాడంబరంగా కొనసాగాయి. వచ్చే కల్యాణోత్సవం అయినా కోట్లాది మంది సమక్షంలో జరగాలని ప్రార్థించాను. కరోనా అంతం కావాలని కోరుకున్నా. పాడి పంటలతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి. కరోనా కష్ట కాలంలో ప్రజలందరూ స్వీయ నియంత్రణ పాటిస్తూ పారద్రోలాలి. ప్రభుత్వానికి తోడుగా నిలవాలన్నారు. సెకండ్ వేవ్‌లో గత వారం పదిరోజులుగా కేసులు అధికమవుతున్నాయి. పాజిటివ్ కేసులు పెరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆక్సిజన్, బెడ్ల కొరత లేకుండా ప్రజానీకాన్ని ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్ కరోనా నుంచి త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

**చరిత్రలో నేటినిజం**

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ బలదేవరాజు చోప్రా
ఇల నాడే మన కానగ మహాభారతమున్
పేలు తెరపులుగా టీవీ!
విలువలను సముద్ధరించె విస్మయముగాన్!

(ఏప్రిల్ 22 మహాభారత్ టీవీ సీరియల్ నిర్మాత విఖ్యాత దర్శకుడు బీ.ఆర్. చోప్రా పుట్టిన రోజు...)



-రాధశ్రీ
సెల్: 9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## అర్థాకలితో ఎవరూ ఇబ్బంది పడొద్దు : మంత్రి గంగుల

కరీంనగర్. ఏప్రిల్ 21:(నేటినిజం ప్రతినిధి):రాష్ట్రంలో ఎవరూ అర్థాకలితో ఇబ్బంది పడొద్దన్న సీఎం కేసీఆర్ ఆదేశానుసారం ప్రైవేటు పాఠశాలల బోధన, బోధనేతర సిబ్బందికి ప్రభుత్వం అందించే 25 కిలోల బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి గంగుల కమలాకర్ బుధవారం కరీంనగర్‌లో లాంఛనంగా ప్రారంభించారు. యుడీఐఎస్ఈలో నమోదైన 1,13,850 మందికి రూ. 2 వేల నగదుతో పాటు 13,715 రేషన్ షాపుల ద్వారా 3 వేల మెట్రిక్ టన్నుల బీపీటీ బియ్యం పంపిణిని ప్రభుత్వం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ..

కరోనా సంక్షోభంతో ప్రపంచం, భారతదేశంలోని మిగతా అన్ని రాష్ట్రాలు ప్రజలు, ఉద్యోగులని వారి మానాన వారిని వదిలేసి చేతులెత్తేస్తే కేవలం తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ ప్రోద్బలంతో సంక్షేమాన్ని కొనసాగించడమే కాక మానవతా దృక్పథంతో మరింత సాయం చేస్తుందన్నారు. ప్రైవేట్ టీచర్లు, స్కూళ్ల సిబ్బందికి పాఠశాలలు పునఃప్రారంభించే వరకూ సాయాన్ని కొనసాగించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో ఇబ్బందుల్లో ఉన్నా, ఏ హైకోర్టు, ఇతర సంఘాలు డిమాండ్ చేయకున్నా మానవతా దృక్పథంతో అందరిని ఆదుకుంటున్నట్లు పేర్కొన్నారు.

డాటా ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ చివరి వ్యక్తి వరకూ సాయం అందేలా సీఎం ఆదేశాల్ని పాటిస్తామని మంత్రి చెప్పారు. ప్రతీ ప్రైవేట్ టీచర్, సిబ్బంది ఆత్మగౌరవంతో బ్రతికేలా స్కూళ్లు ప్రారంభమయ్యేవరకూ ఈ సాయం కొనసాగుతుందని తెలిపారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకూ 3027 మంది ఉద్యోగుల్ని గుర్తించి రూ. 2 వేల సాయం అందజేతతో పాటు 441 రేషన్ షాపుల ద్వారా 76 మెట్రిక్ టన్నుల బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రికి కరోనా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: దేశంలో కరోనా మహమ్మారి బారినపడుతున్న రాజకీయ ప్రముఖుల జాబితా అంతకంతకే పెరిగిపోతున్నది. సోమవారం భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావుకు కరోనా పాజిటివ్ రాగా, మంగళవారం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీకి కరోనా వైరస్ సోకింది. తాజాగా కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిషాంక్ కరోనా బారినపడ్డారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ఈ రోజు చేయించుకున్న కరోనా నిర్ధారణ పరీక్షల్లో నాకు పాజిటివ్‌గా తేలింది. మా వైద్యులు సూచించినట్లుగా నేను చికిత్స తీసుకుంటూ, మెడిసిన్ వాడుతున్నాను. ఇటీవలి కాలంలో తనను కలిసిన అధికారులు, మిత్రులు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నా. అందరూ కరోనా పరీక్షలు చేయించుకోండి. కొద్ది రోజులపాటు హోమ్ క్వారెంటైన్‌లో ఉండండి అని పోఖ్రియాల్ సూచించారు.

## 95 రోజుల్లోనే 13 కోట్ల మందికి కోవిడ్ టీకా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: కేవలం 95 రోజుల్లోనే 13 కోట్ల మంది కోవిడ్ టీకా ఇచ్చినట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది. అత్యంత వేగంగా కరోనా టీకాలు ఇచ్చిన దేశం మనదే అని ఆరోగ్యశాఖ పేర్కొన్నది. 13 కోట్ల కోవిడ్ టీకా డోసులు ఇచ్చేందుకు అమెరికాకు 101 రోజులు పట్టినట్లు ఆరోగ్యశాఖ చెప్పింది. మరో వైపు డ్రాగన్ దేశం చైనా ఆ ఘనతను 109 రోజుల్లో అందుకున్నది. ఇప్పటి వరకు ఇండియాలో వ్యాక్సిన్ తీసుకున్న వారి సంఖ్య 13,01,19,310గా ఉంది. గత 24 గంటల్లోనే 29,90,197 మందికి టీకా ఇచ్చారు. మహారాష్ట్ర, రాజస్తాన్, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, బెంగాల్, కర్నాటక, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలు 59.33 శాతం డోసులను ఇచ్చినట్లు ఆరోగ్యశాఖ చెప్పింది. జనవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియ మొదలైన విషయం తెలిసిందే. తొలుత హెల్త్‌కేర్ వర్కర్లకు ఇచ్చారు. ఆ తర్వాత ఫ్రంట్‌లైన్ వర్కర్లకు ఫిబ్రవరి 2 నుంచి వ్యాక్సినేషన్ ప్రారంభమైంది. మార్చి ఒకటో తేదీ నుంచి 60 ఏళ్లు దాటిన వారికి, ఆ తర్వాత ఏప్రిల్ ఒకటి నుంచి 45 ఏళ్లు దాటిన వారికి టీకాలు ఇవ్వడం మొదలైంది.

# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



సూర్యాపేట, ఏప్రిల్ 21: మానవ సమాజంలో మంచిని గ్రహించాలి అన్నదే రామాయణ పరమార్థం అని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. వందలు, వేలు, లక్షల సంవత్సరాల నుంచి శ్రీరామనవమి వేడుకలు జరుపుకోవడం అంటే మంచి అనే సందేశం ఎప్పటికప్పుడు ఆయా సమాజలకు చెర వేయడమేనని ఆయన చెప్పారు. హైందవ ధర్మ విలువల ప్రామాణికతకు పెద్ద పీట వేసే హిందువుల పండుగ ఏదన్నా ఉంది అంటే అది శ్రీరామనవమినేనని ఆయన చెప్పుకొచ్చారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేదాంత భజన మందిరంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి జగదీష్ రెడ్డి**

ఈ సందర్భంగా మంత్రి జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వాడ వాడలో రంగ రంగ వైభోగంగా జరుపుకోవాల్సిన శ్రీరామ నవమి వేడుకల్ని కొవిడ్ నేపథ్యంలో రద్దు చేసుకోవాల్సి వచ్చిందన్నారు. కొవిడ్ నిబంధనలకు లోబడి ప్రత్యేక పూజలు నిర్వహించాల్సి వచ్చిందని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మానవ సమాజం కూడా కరోనా పీడ నుండి విముక్తి చెందాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు మంత్రి జగదీష్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ పెరుమాండ్ల అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 22-4-2021


## కందుకూరి వీరేశలింగం సేవలు చిరస్మరణీయం



వీరేశలింగం జయంతి సభలో పాల్గొన్న అతిథులు.

తెలుగుజాతి, భాషకు కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ అభ్యుదయవాది, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని ఆదివారం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరిగింది. టీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు జి. దేవీప్రసాద్ మాట్లాడుతూ శతాధిక గ్రంథకర్త, మహాకవి వీరేశలింగంపంతులు రచనలు చేసి, తెలుగు సాహిత్యానికి మహోపకారం చేశారన్నారు. సాహితీవేత్త డా॥బి. జయరాములు మాట్లాడుతూ మూఢవిశ్వాసాలను నిర్మూలించి నిద్రాణమైన తెలుగుజాతిని మేల్కొల్పిన నవయుగ వైతాళికుడు వీరేశలింగం అని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించగా రచయిత వడ్డేపల్లి కృష్ణ, గాంధీనగర్ డివిజన్ కార్పొరేట్ ఎ. పావని వినయ్‌కుమార్‌లు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## మానస ఆధ్వర్యంలో ప్రముఖులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



పురస్కారాల ప్రదానం చేస్తున్న అతిథులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, రఘుశ్రీ తదితరులు.

మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వాహక సంస్థ అధినేత, కవి రఘుశ్రీ ఆధ్వర్యాన శనివారం సాయంత్రం త్యాగరాయ గానసభలో జరిగింది. అతిథిగా హాజరైన తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ కళలతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాల్సిన కాలం వచ్చిందన్నారు. సభలో రచయిత శంకర నారాయణ, సినీ పాత్రికేయుడు భగీరథ, కవి మరింగంటి లక్షణాచార్యులు, నర్మదారావు, నరసింహారావు, శోభారాణి, కోకా భవాని, శ్రీదేవి. ఉదయ్‌కుమార్, నాయక్, ప్రవీణ్‌కుమార్, పద్మనాగరాణి, సురేంద్రనాథ్‌లకు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. బండారు రామచంద్రరావు అపర్ణ పాల్గొన్నారు.

## నేటికవిత-కవిత్వ విశ్లేషణ



-దాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240



-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

*నేటికవితలో ఈ వారం: స్వయంకృతం అనే అంశంపై వచ్చిన 43 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన కవితల్లోంచి ఓ మూడు ఎంపికయిన కవితలపై విశ్లేషణ*

### నువ్వే కర్తవి

శూన్యం నుండి శూన్యం లోకి
సాగే పయనంలో ఎదురయ్యే
ప్రతి మలుపులో పుట్టే ప్రతి ఊహకు
రెక్కలు తొడుగుతుంటావు.

ఊహను శ్వాసిస్తుంటావు
జీవితమంతా ఊహల్ని పెనవేసుకుని
కోరికల సంద్రంలో ఈదుతుంటావు
అడుగైనా కదల్చకుండా

రేపటికోసం ఈ రోజునుండే
కేవలం కలల్ని కంటుంటావు.

వాస్తవం ధిక్కారస్వరంతో
ఊహల్ని చెదరగొడుతూ
వెంటపడినా ఆశల వెంటసాగే
నీ పరుగు మాత్రం ఆపకుండా
ఊహాలోకంలోనే బతుకుతుంటావు.

ఊహా మొలక ఓనాడు
తీక్షణ వాస్తవ కిరణాలు సోకి
వాడిపోతుంది
నువ్వు చేసుకున్న స్వయంకృతం
వాస్తవంతో నీ స్థానమెక్కడో చూపుతుంది

కాలం నీ ఊహకన్నా వేగంగా
పరుగెత్తి నిన్ను ఒంటరిచేస్తుంది.

అనుభవంలోకి వచ్చాకే తెలుస్తుంది
మత్తెక్కించే ఊహలు అంధుణ్ణి చేస్తే
వాస్తవాలు జీవితం కన్నా
కఠినంగా ఉంటాయని
ఊహల్లో బతికి
పాతాళంలోకి చేరాలన్నా
పనిచేసి ఆకాశంపైకెగరాలన్నా
నీ స్వయంకృతమే
బాటలు పరుస్తుందనీ...



-వేణుమాధవ శర్మ
9666851844

కవి శ్రీ వేణుమాధవ శర్మ గారు 'స్వయంకృతం' అంశంపై 'నువ్వే కర్తవి' శీర్షికతో రాసిన కవితలో తమ తాత్త్వికతను ప్రదర్శించారు. అంశం వెలుగులో ఆయన ప్రకటించిన భావాల్లో సరళత్వానికి చోటుకల్పించారు. మన సమస్యలకు స్వయంకృతమే చాలా వరకు కారణమనే అర్థం ధ్వనించేలా ఆయన తమ కవితను కొనసాగించారు. శీర్షిక, ఎత్తుగడ, కవిత్వ నిర్వహణ, నిర్మాణక్రమంలో కనీస కవిత్వ ప్రమాణాలు పాటించడానికి ప్రయత్నించారు. ఎత్తుగడగా కవి శర్మగారు పొందుపరచిన ప్రారంభపంక్తులు బాగున్నాయి. శూన్యం నుండి శూన్యంలోకి సాగే పయనంలో ఎదురయ్యే ప్రతి మలుపులో పుట్టే ప్రతి ఊహకు రెక్కలు తొడుగుకుంటావు అని చెప్పడంలో కవి శర్మగారు తమ కవితాపటిమను చాటుకున్నారు. జీవితమంతా ఊహల్ని పెనవేసుకుని.. కోరికల సంద్రంలో ఈదుతామనీ..అడుగైనా కదల్చకుండా రేపటికోసం కలల్ని కంటామని ఆవిష్కరించిన తీరు బాగుంది. సదా ఊహాలోకంలో సేదతీరుతామన్న వైనాన్ని అక్షరాలలో నిక్షిప్తం చేయడానికి కవి ప్రయోగించిన పదబంధాలు కవితలో చక్కగా ఒదిగిపోయాయి. ఊహా మొలక శాశ్వతం కాదనీ.. ఎప్పుడో ఒకప్పుడు వాస్తవంలో వస్తామనీ.. అప్పుడు మన స్థానమెక్కడో తెలుపుతుందని తెలియజెప్పారు. కాలం మన ఊహకన్నా వేగంగా పరుగెత్తి మనల్ని ఒంటరిగా మార్చుతుందని తేల్చి చెప్పారు. 'మత్తెక్కించే' ఊహలు అంధుణ్ణి చేస్తాయని, వాస్తవాలు జీవితం కన్నా కఠినంగా ఉంటాయని విడమరచి చెప్పారు. ఊహల్లో బతికి పాతాళంలోకి చేరాలన్నా.. పనిచేసి ఆకాశంపైకెగరాలన్నా మన చేతిలోనే ఉందన్న సత్యాన్ని కవి వివరించయత్నించారు. భ్రమల్లో బతుకవద్దనీ.. వాస్తవం లో జీవించాలన్న సందేశం ఈ కవితలో ఉంది. కవి శిల్పం అభివ్యక్తి వంటి అంశాల్లో మరింత శ్రద్ధ చూపగలరన్న నమ్మకం ఉంది.

### మనిషి నైజం

తప్పో ఒప్పో నోటిదురుసుతనంతో
కారుకూతల అహంకార స్వయంకృతానికి
బలైన హృదయవేదనలెన్నో
ప్రాణమంటి స్నేహవృక్షాన్ని
కూకటి వేళ్ళతో కూల్చుకుని
తలదించుకునే అగచాట్లను
అధిగమించలేక
ఒంటరి బాటసారిలా
ఎడారి పయనం...!

దిక్కుతోచని అగమ్యం
వెంటరాని ఆత్మబంధువులు
విధివంచిత సంఘటనలు
సంఘర్షణలూ..
చేతులుకాలాక ఆకులు పట్టినట్లు
ప్రయోజనం లేని ఆత్మవిమర్శలు
నీటిమూటలవుతుంటే..
గర్వం సిగ్గుతీస్తూ
పరిస్థితులను ప్రశ్నించగా
జవాబులేని స్వయంకృతాపరాధానికి
మూల్యం చెల్లించలేని మనసుబాధ
మౌనంగా మీనమేషాలు లెక్కిస్తూ
ఆత్మతృప్తిలేని మనిషి
స్వార్థపు జాడల్లో పరుగెడుతూ
వ్యక్తిత్వం లేని వింత పోకడలను
అందుకుంటున్నాడు !

మారని మనిషినైజం
నేటితరానికి గొడ్డలిపెట్టయి
అడ్డొచ్చిన ఆత్మాభిమానాన్ని
చంపుకుంటూ
స్వయంకృతాపరాధానికి
సమస్తలోక విపత్తులకు కారణభూతమై
కఠిన శిలలుగా మిగులుతున్నారు



-చిందం సునీత
9701075502

కవయిత్రి శ్రీమతి చిందం సునీత గారు 'స్వయంకృతం' అంశంపై రాసిన కవితలో 'మనిషినైజం' ను ఎత్తిచూపారు. స్వయంకృతంతో తెచ్చుకునే అనర్థాలను ఏకరువు పెట్టారు. తప్పో ఒప్పో తెలుసుకోక విచక్షణ కోల్పోయి నోటి దురుసుతనంతో ఎదుటివారి హృదయాలను గాయపరుస్తామనీ.. ప్రాణమంటి స్నేహవృక్షాన్ని మనకు మనమే కూకటి వేళ్ళతో కూల్చుకోవడం, ఒంటరి బాటసారిలా ఎడారి పయనం చేయడానికి స్వయంకృతమే కారణమని తేల్చిచెబుతూ కవితను ప్రారంభించారు. స్వయంగా కొని తెచ్చుకున్న సమస్యలను అధిగమించడానికి పడే పాట్లను వివరిస్తూ చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఉంటుందని తెలియజేశారు. స్వార్థపు జాడల్లో పరుగెడుతూ వ్యక్తిత్వం లేని వింతపోకడలకు తెరలేపుకోవద్దన్న అంశాన్ని నర్మగర్భంగా ప్రస్తావించారు. స్వయంకృతంతో కఠిన శిలలుగా మిగులవద్దనీ..ఒంటరి బతుకు బ్రతకవద్దన్న చక్కని సందేశాన్ని అందించారు. కవితావస్తువుకు బలం చేకూర్చడానికి వీలుగా శిల్పం విషయంలో కాస్తంతైనా చతురతను ప్రదర్శించారు. అభివ్యక్తిలో అలతి అలతి పదాలకు పెద్దపీట వేశారు. పదబంధ ప్రయోగంలో మరింత పరిణతిని సాధిస్తారన్న విశ్వాసం ఉంది.

### ప్రాణ సంజీవిని

నిర్దయగా వెక్కిరిస్తున్న
కాలం..వాగుకో..
రేవుకో వలస పొమ్మంటుంది
కానీ ఎక్కడా తడే లేదు
కంటి పాపలో
గుండె లోతుల్లో తప్ప
పడతి లాంటి ప్రకృతిని
ప్రాణంలా చూసుకొని
ఉంటే సంజీవినిలా నాకు
ప్రాణం పోసేది.

నాడు
ఆకుపచ్చని వనంలో
నా వెంట నీవు
నీ వెంట నేను
జీవితం నల్లేరు మీద నావలా ఉండేది.

మరి నేడు
మితిమీరిన నా అహం
స్వయంకృతాపరాధం
ధన వ్యామోహం. స్వలాభం
చివరకు
కాళ్ళకింద ఇసుకనుకూడా తవ్వుతూ
నిలబడడానికి నేల కూడా..
లేకుండా చేసుకున్నాను.
మరో ప్రపంచాన్ని సృషించాలనుకున్నా
కానీ నేనున్న ప్రపంచం
ఉనికి కోల్పోతానని అనుకోలేదు.

మళ్ళీ ఆహ్వానిస్తున్నా
ఆకుపచ్చని ఆశలా..
పచ్చపచ్చగా వనదేవతలా
మా బతుకుల్లోకి రా.. పచ్చపచ్చగా
పదికాలాలు కాపాడుకుంటాం
అని ప్రమాణం చేస్తున్నా



-మాధవి శ్రీనివాస్
9666851844

కవయిత్రి శ్రీమతి మాధవి శ్రీనివాస్ నందిమళ్ళ గారు 'స్వయంకృతం' అంశంపై 'ప్రాణ సంజీవిని' శీర్షికతో రాసిన కవితలో తమదైన శైలిని ప్రదర్శించారు. స్వగతంకు చోటు కల్పిస్తూ కవితను తీర్చిదిద్దారు. నిర్దయగా వెక్కిరిస్తున్న కాలం..వాగుకో..రేవుకో వలస పొమ్మంటుందని..కానీ ఎక్కడా తడే లేదు.. కంటిపాపలో..గుండెలోతుల్లో తప్ప అని వ్యాఖ్యానించారు. ప్రకృతిని ప్రాణంలా చూసుకోవాల్సింది పోయి మితిమీరిన అహంకారం...ధనవ్యామోహం స్వలాభంతో మనకు మనమే స్వయంకృతంతో పచ్చదనానికి దూరమై పోతున్నామని వాపోయారు. మరో కొత్త ప్రపంచ నిర్మాణం కోసం.. ప్రస్తుత ప్రకృతిని ఫణంగా పెట్టవద్దని పచ్చదనాన్ని పదికాలాల పాటు కాపాడుకోవాలన్న సందేశంతో కవయిత్రి మాధవి గారు తమ కవితను రూపుదిద్దారు. ఆకుపచ్చని ఆశలా...పచ్చపచ్చని వనదేవతలా మన బతుకుల్లోకి మళ్ళీ ఆహ్వానించి ప్రకృతిని పదిలంగా కాపాడుకుందామన్న అర్థం ధ్వనించేలా కవయిత్రి తమ భావాలను అక్షరబద్ధం చేశారు. కవయిత్రి మాధవి గారు మున్ముందు మరింత కవిత్వాంశతో రాస్తారని ఆశిద్దాం.

## నానీలు

అమ్మ త్యాగం
ఇప్పుడు అర్థమౌతుంది
నేను
అమ్మనయ్యాను.

దేవుడు
దేన్నైనా పూరిస్తాడు
ఒక్క
అమ్మ స్థానాన్ని తప్ప.



-వడ్డేపల్లి సంధ్య
సెల్:7036000123

# ముంబయికి షాన్.. "ముంబైకర్.."







"నేను ముంబైకర్‌ని!" అంటున్న సంగెవేని రవీంద్ర స్వస్థలం తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లా, బుగ్గారం మండలానికి చెందిన శకల్ల గ్రామం. అప్పులు, ఆత్మహత్యలు తరిమికొడితే, ఆకలి మూలాల్ని పెకిలించుకుని ముంబైకి వలస వెళ్ళిన అసంఖ్యాక అభాగ్యుల్లో తనూ ఒకడు. ముఖ్యంగా చేనేత కార్మికులు తమ కష్టానికి తగిన ఫలితం దక్కక, ప్రభుత్వం నుండి చేయూత కరవై, పొట్ట చేతిన పట్టుకుని బ్రతుకు తెరువు కోసం దశాబ్దాల క్రితమే ముంబై నగరంలో కాలుపెట్టారు. బట్టల మిల్లు కార్మికులుగా, కూలీ.. హమాలీలుగా, ధోబీ, మంగలి, ట్యాక్సీ డ్రైవర్లుగా చెమట చిందించిన ఆనాటి తరం నుండి డాక్టర్లు, లాయర్లు, శాస్త్రజ్ఞులు, ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులు, భావన నిర్మాతలు, ఉన్నత అధికారులు యిలా ఎదిగిన ఈతరం మేధావులూ ముంబై నగరం నలు చెరగులా సాక్షాత్కరిస్తారు. యిలా ముంబై నగర అభివృద్ధి కోసం తరతరాలుగా శ్రమిస్తున్న తెలుగువారందరి ప్రతినిధిగా 'నేను ముంబైకర్‌ని' అని నినదిస్తున్నాడు రవీంద్ర.

సంగెవేని రవీంద్ర ముంబైలో స్థిరపడినా తన మూలాలను మరిచి పోలేదు. తెలుగు సాహిత్యం పట్ల తన మక్కువనూ ఒదులుకోలేదు. మంచి కవిగా ఎదిగాడు. దశాబ్దంన్నర సాహిత్య ప్రస్థానంలో వివిధ ప్రక్రియల్లో 16 గ్రంథాలు వెలువరించారు. కవిత్వంతో బాటు గద్య రచనలోనూ సిద్ధహస్తుడు. ముంబై ప్రముఖుల చరిత్రతో బాటు అక్కడి ఇంగ్లీష్ తెలుగువారి చరిత్రలను గూడా గ్రంథస్తం గావించాడు. సంగెవేని సాహిత్య సంపదలో ఓ కథా సంపుటి తళుక్కుమంది. తెలంగాణ గడీల చరిత్ర పరిశోధన కూడా చోటు చేసుకున్నది. తెలుగు సాహితీ ప్రియులతో 'వారెవా' అనిపించుకుంటున్న రవీంద్ర రాసిన కొన్ని పొత్తాలపై నేను సమీక్షా వ్యాసాలు రాసినట్టు గుర్తు.

'నేను ముంబైకర్'ని అనేది దీర్ఘ కవిత. ఇదివరలో రెండు దీర్ఘ కవితలు రాసిన అనుభవజ్ఞుడు ఈ కవి.

**"మా ఊరి మట్టి**
**దిగులుతో ఎర్రబడింది**
**ఆకలి కవాతు ముందు**
**బతుకు పాట మూగవోయింది"** ఈ దుర్భర పరిస్థితుల్లో
**"కరువు తరిమిందో**
**కడుపు పొమ్మందో**
**తెలియని అయోమయంలో**
**కనీసం కన్నీటి చుక్కలు**
**తాగేందుకైనా ఎక్కడికో వెళ్ళాల్సిందే"** ఉన్న ఊరు వదలి వెళ్ళడం బాధాకరమే. అయినా తప్పదు. ఎక్కడికెళ్ళాలి?

**"ముంబై సైరన్ కూత**
**ఎందుకో ఆత్మీయంగా వినిపించింది"** అంతే!
**"ఒకటిన్నర శతాబ్దం ముందు**
**మొదటి మిల్లు మొదలెట్టకముందే**
**నేనిక్కడ పాదం మోపాను.**
**వలస పక్షిగా మారాను**
**మేఘాల్లేని ఊరు తరిమికొడితే**
**నాది కాని మట్టికి వలసయ్యాను**
**వలస ఎడారిలో**
**విత్తనమై మొలకెత్తక తప్పదు"** ఓ దృఢ నిశ్చయం! బ్రతుకు పాఠాలు మళ్ళీ మొదట్నుంచి మొదలెట్టాల్సిందే!! కానీ ఎలా?
**"తప్పెవరిది?**
**దొరతనం బాణాలకు కన్నీటి కాలువయ్యే**
**ఉప్పుమూటలాంటి ఊరిదా?**
**చిల్లర నాణాల రుణాల్ని ఎరవేసి**
**మిత్తిచేపల బతుకుల్ని వేటాడే వ్యవస్థదా?"**
సమాధానం దొరకని ఈ ప్రశ్నల ముసురును తరిమికొడ్తు ముంబైలో అడుగుపెట్టిన తను ఒక్కడు కాదు.
**"దోబీఘాట్‌లోని మా ఊరి రాజవ్వ**
**అంగట్లో అరటిపళ్ళు అమ్మే అవ్వ**
**ఇరానీ హోటల్లో మిగిలిపోయిన ఎంగిలి**
**కంచాలు కడిగే చిన్నారి బాలలు**
**ట్యాక్సీ డ్రైవర్లు, మిల్లు కార్మికులు**
**భవన నిర్మాణ కార్మికులు.."**
యిలా..
**"ఎందుకో ముంబయిలో**
**అందరూ నావాళ్ళే కనిపిస్తున్నారు**
**ఇక్కడ జీవితం క్షణక్షణం**
**రక్త స్పర్శల రణక్షేత్రం**
**ఆకాశాన్ని జోకొట్టె**
**చందమామలువడవు..**
**భవిష్యత్తును స్వప్నించే**
**తూనీగ నిద్రలుండవు..."**
అయినా
**"బతుకాలంటే పోరాడాలి**
**కష్టపడటం కొత్తేంకాదు"**
**కృత నిశ్చయం.**
**"అందుకే కళ్ళు మూసుకుని**
**ఈ నేలను ముద్దెట్టుకున్నా.."**
వెంటనే కార్యాచరణను నడుం బిగించాడు ముంబైకర్.
**"ఇప్పుడు.. నన్నునేను నిలుపుకోవాలి**
**నన్ను నేను తెలుపుకోవాలి**
**దశాబ్దాలుగా ముంబయి రోడ్లకు**
**ఒకొక్కటిగా.. నాయవ్వన రేకల్ని అర్పిస్తున్నాను**
**పేగుల్ని పోగేసి బట్టలల్లాను**
**రక్తాన్ని తడిచేసి రంగులద్దాను"**
యిలా శ్రమశక్తిని అనుక్షణం ధారబోస్తున్న ముంబైకర్‌లు ముంబైనగరంలో వేలకొద్దీ దర్శనమిస్తారు.
**"డబ్బిక్కడ అవసరమొక్కటే కాదు**
**అది.. ఆత్మరహిత డాంబికానికి**
**నిర్జీవ దరహాసాలకి**
**వలువలు వదిలి విజయానికి**
**ఆమోదముద్ర"** అయినా యజమాని యజమానే.. ముంబైకర్ ఎప్పటికీ బానిసే
**"వాడికి వ్యాపారమొక్కటే పరమోధర్మం**
**వాడు అధీకృత యజమాని**
**నేను.. సాధికార కార్మికుణ్ని'**
**"నిత్యం దోపిడి చేస్తున్న శ్రమచోరుల్ని**
**గుర్తించని అశక్తను.."**
ఎన్నికష్టాలు ఎదురైనా సరే!
**"జీనా యహా మర్నాయహా**
**ఇస్కే సివా జానా కహా!"**
తప్పదన్నప్పుడు తప్పించుకోవడానికి ఆరాటమెందుకు? తన ఉనికిని తాను కాపాడుకోవాల్సిందే!
**"ఇది నన్ను నేను నిలుపుకునే ఆరాటం**
**నా పెహచాన్ వెతుక్కునే ప్రయత్నంలో**
**నాతో నాకే పోరాటం"** ఊరుగాని ఊళ్ళో బ్రతకాలన్న కసి. ఏదైనా సాధించి తన అస్తిత్వాన్ని చాటుకోవాలన్న పట్టుదల.
**"బీఎమ్‌సి బిల్డింగ్, టైమ్స్ ఆఫీసు**
**రాజా భాయిటవర్, జనరల్ పోస్టాఫీసు**
**చరిత్రకు అద్దం పట్టే ప్రతిభవనం**
**నా చెమట చుక్కల.. ప్రతిఫలమే**
**నేను కట్టిన భవనాలు**
**నేల విడిచి సాముచేస్తుంటే**
**నేల ఈనినట్లు గుడిసెలు**
**నలిగిన చుక్కలై**
**నగరాన్ని ఆవరించుకున్నాయి"**
భారతదేశ ఆర్థిక రాజధానిగా రూపుదిద్దుకున్న ముంబైనగర పురోగతిలో ఎక్కడ తడిమినా ముంబైకర్ చెమట చెమట తడి, తడిగా తగుల్తుంది. మేధోశక్తి తళుక్కున వెలుగులీనుతుంది.
యిప్పుడు **"గుడిసెలుకాదు**
**నన్నిప్పుడు భవనాలే భయపెడ్తున్నాయి"**
**"ఇక్కడ నేను చరిత్ర నిర్మించాను**
**ఇంత చేసినా ఏ పుటలో నా చరిత్ర లేదు**
**ఏ చరిత్రలో నేను అక్షరాన్ని కాదు**
**ఎంతటి విషాదం?**
"మంత్రాలయలో" "తెలుగు మాట్ లేదు" అయితేనేం?
**"ముంబై మేరి జాన్ అయితే**
**నేను ముంబయికే షాన్"**
సగర్వంగా ప్రకటిస్తున్నాడు
**"నేను మరాఠీ తోటలో వికసించిన**
**తెలుగు పూవుని..."**
అటు తెలుగు నేలా నాదే.. ఈ మరాఠీ తోటా నాదే! నాదొక్కటే విన్నపం!
ముంబైకర్‌ది ఒక్కటే విన్నపం..
**"నన్ను కేవలం ఓటు ముద్రను చేయకండి**
**అక్కడో ఇక్కడో ఎక్కడో**
**నన్నో మట్టి రేణువుగానైనా గుర్తించండి**
**ఆ మట్టిలో నన్ను మొలకెత్తనివ్వండి**
**నన్ను మొలకెత్తనివ్వండి"** అంటూ వేడుకుంటున్నాడు ముంబైకర్.

పుట్టిన ఊరు విడిచి వెళ్ళాల్సి వచ్చిందన్న వేదన, వలస వెళ్ళిన ఊరిలో గుర్తింపు లేదన్న ఆవేదన, దీర్ఘ కవితలోని ప్రతి వాక్యాన్ని ఆర్ద్రతో ముంచెత్తి పాఠకుల గుండెల్ని బరువెక్కిస్తాయి.

అక్కడక్కడా పరుచుకున్న భావావేశాన్ని ఒక క్రమంలో పేర్చి (Edit) పునరావృతమైన చరణాలను త్యజించి వుంటే మరింత చిక్కగా భాసిల్లేదన్న భావన కలిగితే అది పాఠకుడి తప్పుకాదు.

ముంబైకర్ కహానీని కవిత్వీకరించడంలో తెలుగువారి వలసలు, భవన నిర్మాణంలో రాజకీయ రంగంలో తెలుగువారు, మహారాష్ట్రలో తెలుగు పత్రికలు వంటి చిరు వ్యాసాలను జతపరిచి కావ్యానికో నిండుతనం సమకూర్చిన రవీంద్ర ప్రయత్నం ప్రశంసనీయం.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాతికకుపైగా పురస్కారాలు, బిరుదులు అందుకున్న సంగెవేని రవీంద్రకు **"నేను ముంబైకర్‌ని"** గ్రంథం మరిన్ని గౌరవ ప్రతిష్ఠలు ఆర్జించి పెడ్తుందనడంలో సందేహంలేదు.

మొత్తానికి తెలుగు రాష్ట్రాల నుండి ముంబైకి వలస వెళ్ళిన ముంబైకర్‌లు **"ప్రవాసాంధ్రులు కాదు.. ప్రకాశాంధ్రులు."** ఇది నా మాట కాదు.. డా॥ ఎన్.గోపి ముందు మాట.

**ప్రతులకు:** సిసి కంపౌండ్
హనుమాన్‌లేన్ లోయర్ పెరల్,
ముంబయి-400 013.
మరియు అన్ని
పుస్తక కేంద్రాలలో



-రమణ వెలమకన్ని
సెల్:98660 15040

## భల్లం భాష్యం
## కవిత్వాన్ని కవిత్వంగా చూసేవాళ్ళ కోసం...

**కవి ఎపుడూ కాలంకంటే ముందే ఉంటాడు. కాబట్టి తాను మరణించే లోపల ఈ ప్రపంచాన్నికి ఇంకొంచెం అందంగా మలచడానికి తన కవిత్వమనే అక్షరాయుధాన్ని సంధిస్తూ వుంటాడు.**

తెలుగులో ఇంతకు ముందు వచ్చినన్ని మంచి మంచి కవితలు రావడం లేదని, ఒకవేళ వస్తున్నా కొత్త కొత్త వస్తువుల్ని స్వీకరించడం లేదని, మారుతున్న కాలాన్ని పసిగట్టి, మారుతున్న జజీవన సంఘర్షణలను కవిత్వం చేయడంలో కవులు విఫలమవుతున్నారని, లేదంటే పలాయనం చిత్తగిస్తున్నారని, ఇటీవల విస్తృతంగా విమర్శ వినిపిస్తూ ఉంది. అపుడపుడూ పొగడ్తలు, మంచి కవితల పట్ల నాలుగు మంచి మాటలు వినిపిస్తున్నా, ఆ వెంటనే హోమ్ వర్క్ ఇచ్చి, కవుల భుజాలపై ఫలానా విషయాలను రాయాలన్న క్రొంగొత్త బరువును మోపడం కూడా కనిపిస్తూవుంది.

సమాజానికున్న చైతన్యాన్ని కవి తన చైతన్యంతో సమన్వయం చేసి కవిత్వాన్ని రాస్తుంటాడు. అంటే సమాజంలో వున్న స్థితిని విశ్లేషించి ఉండవలసిన స్థితిని సూచిస్తూ కవిత్వాన్ని సృజిస్తాడన్న మాట. అది సామాజిక మార్పు కోసం కృషి చేసే శక్తి యుక్తుల్ని కవి కవిత్వంలో ప్రతిఫలింపచేస్తుంటాడన్న మాట.

కవిత్వానికి కావలసిన పదార్థాలు భాష, అలంకారాలు, ప్రతీకలు, రూపం, నిర్మాణం ఇత్యాదులు. వీటి ఫలితంగా ఏర్పడే అత్యంత గాఢమైన, సూటియైన సరళమైన భాషాబంధం అని కొందరంటుంటారు. కవిత్వానికి గల ప్రధాన గమ్యం యదార్థం కంటే ఉన్నతంగా ఉండడం. కవి ఎపుడూ కాలంకంటే ముందే ఉంటాడు. కాబట్టి తాను మరణించే లోపల ఈ ప్రపంచాన్నికి ఇంకొంచెం అందంగా మలచడానికి తన కవిత్వమనే అక్షరాయుధాన్ని సంధిస్తూ వుంటాడు.

భాష, రూపం, వస్తువు మూడు కవిత్వానికి ముఖ్యమైనా వాటిలో చక్కని భాషవుంటేనే, కవిత్వానికి ఒక రూపం ఏర్పడుతుంది. పాఠకుని మనసులో కవిత్వం బొమ్మ కడితేనే వస్తువు కవితా రూపమై ప్రకటించబడుతుంది. దీన్నిబట్టీ వస్తువుకన్నా రూపంకన్నా, కవిత్వభాష ఎంత ముఖ్యమైందో అర్థమవుతుంది.

చాలా మంది కవుల మాదిరిగా సమకాలీన ధోరణుల్లో పడి కొట్టుకుపోకుండా, ఒక స్వచ్ఛమైన కవిత్వస్వరాన్ని నిజమైన కవి వినిపిస్తాడు. తన జీవితంలోంచి, తన అనుభవ పరిధిలోంచి స్పందనల్ని వెతుక్కుంటాడు. అప్పుడు ఆ కవి స్వరంలో అమలినమైన స్వచ్ఛత కనిపిస్తుంది. సామాజిక అనుభవాల్ని సైతం వైయక్తిక కోణం నుంచి దర్శిస్తున్న వొక ప్రత్యేకత ఆ కవి కవిత్వంలో మనల్ని ఆకట్టుకుంటుంది.

కవి తాను నమ్మిన ఆదర్శం సమాజాన్ని మార్చి, సంప్రదాయాన్ని ఛేదించి, జీవితాలకు వెలుగునిచ్చి, ఒక కొత్త ప్రపంచాన్ని తన కవిత్వం ఆవిష్కరిస్తుందని విశ్వసించినప్పుడు ఎంతో సంతోషిస్తాడు.

కవిని సమాజం కన్నాముందుగా నిలబెట్టే అంశం అతని ప్రాపంచిక దృక్పథం. నిరంతర జీవితాధ్యయనశీలి అయిన కవి జీవితం పట్ల ఏర్పరుచుకున్న దృక్పథమే ఆ కవిని సమాజం కన్నా ముందుకు నడిపిస్తూ, ఆ కవిని వైతాళికుణ్ని చేస్తుంది. కాలం గడిచే కొద్దీ సమాజం మారిన కొలదీ కవి చైతన్యం- సమాజ చైతన్యమైపోయి, తిరిగి కొత్తగా కవి అంతరాంతరాలలో చైత్యం రూపుదిద్దుకుంటుంది.

కవిత్వం ద్వారా తక్షణమే మార్పు కనబడకపోవచ్చు. కానీ, ఆ తర్వాత కాలంలో సమాజం మీద కవిత్వం ప్రభావం ఉండితీరుతుంది. కవిత్వం ద్వారా ప్రజల హృదయాలలో ఆవిష్కరించబడిన కొన్ని విలువలు ఒక సమాజ సంస్కృతిలో అంతర్భాగాలైపోతాయి. ఆ సమాజంలో నివసిస్తున్న ప్రజల సామూహిక చైతన్యంలో కూడా కవిత్వం కలిసిపోతుంది. గొప్ప కవిత్వం సమాజపు అంతరాత్మగా రూపొందుతుంది.

కవిత్వం స్థిరపడ్డాక ప్రతీపదం మృదువుగా మారుతుంది. కవిత్వం మరింత భావచిత్రంగా పరివర్తన చెందుతుంది. అప్పుడు దానికో ప్రత్యేక సౌందర్యమేర్పడుతుంది. దేని సౌకుమార్యం దానికుంటుంది. ప్రతీక చిక్కగా, సారాంశంగా మారి కవిత్వమయ్యాక, కవికి అక్కడ అంతగా ప్రాముఖ్యముండదు. ప్రతీ ప్రతీక ప్రశాంతంగా, నిర్మలంగావుంటే కవిత్వానికి అదనపు ఆకర్షణ అవుతుంది. ఎందుకంటే కవిత్వం నిజంగా పాఠక హృదయంలో స్థిరపడితే అక్కడ కచ్చితంగా కవి ప్రస్తావనే ఉండదు కాబట్టి.

జెట్‌స్పీడ్‌లో మారుతోన్న సాంకేతిక విధానాలు సమాజంలో ఎన్నడూ లేనంతగా మార్పుల్ని తీసుకొస్తున్న నేపథ్యంలో- కవిత్వంలో కూడా సాంకేతీకరణ, వ్యాపారీకరణ పెచ్చు పెరిగిపోతున్నాయి. అభౌతిక కల్పన ప్రాధాన్యం వహిస్తుంది. కవి సమాజాన్నుంచి కాకుండా సాంకేతిక ప్రచార సాధనాల్ని దృష్టిలో పెట్టుకొని కవిత్వాన్ని సృజిస్తున్నా కదా.

సమకాలీన భావ ప్రతినిధిగా- ప్రతికవి కలం పడతాడు. తన కాలం నాటి సమస్యలన్నింటికి స్పందిస్తాడు. ఆ కవి వేణిని నుండి జాలువారిన ప్రతి రచన ఒక ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని రాసిందే అవుతుంది.

సామాజిక, సాంఘిక ఆర్థిక రాజకీయ ఘర్షణల వత్తిడుల సంక్షోభాల నేపథ్యంలో కవులు ఒక్కొక్కసారి తమ తమ రచనల్లో తమ నిరసననూ, నిబద్ధతనూ, ఆలోచనలనూ, ఆచరణాత్మక విధానాలను తెలియ చేస్తుంటారు. అప్పుడు ఆయా కవుల కవిత్వంలో భౌతిక ప్రపంచంతో పాటు, మానసిక అంతర ప్రపంచమూ ఉంటుంది. ఈ ప్రపంచంలోని దుఃఖమూ, ఒంటరితనమూ దిగులూ, బాధ, పరాయికరణ, ద్వేషం, ఈర్ష్య, దోపిడి ఇత్యాది కల్లోలిత స్థితిగతులు అక్షరీకరించబడతాయి. అలాగే ప్రేమ, మానవత, సానుభూతి, ఉదారత ఇత్యాదిభావనల ఉదాత్తీకరణ కూడా కవిత్వీకరించబడుతుంది.

కేవలం కవిగా బతికితేనే సరిపోదు. నిరంతరం సాహిత్య సంబంధిత గ్రంథాల్ని అధ్యయనం చేస్తూనో, సీనియర్ కవుల సాహిత్య ప్రసంగాన్ని వింటోనో, సాహిత్యానుభవ కార్యక్రమాల్ని సాధన చేస్తూనో, తదనుగుణమైన ఆలోచనలు మనసులో ఉండేలా చూసుకోవాలి. అటువంటి సాహిత్య చర్చలు చేపట్టాలి. ముఖ్యంగా అధ్యయనగతమైన కవితా సంపుటాలలో- సంకలనాలలో వాడబడిన భావచిత్రాల, ప్రతీకల సామర్థ్యం- అందుకు కవి శక్తియుక్తులు గమనించాలి.

అణిచివేస్తే ఏదైనా నేలపాలు అవుతుందేమో. కానీ- కవిత్వం మాత్రం నింగి ఎత్తుకు ఎగురుతుంది. ఎదుటవాణ్ని ఎదిరిస్తుంది. ఎప్పుడయితే ఇవన్నీ అవగాహనకొచ్చి, నిరాటంకంగా భూమికి ఒక అడుగుపైన కవిత్వం పయనిస్తుంది. ఆ క్షణం గురుత్వాకర్షణశక్తి కవిత్వం విషయంలో పనిచెయ్యదు. అప్పుడు కవిత్వంతో పాటు పాఠకుడూ భావచిత్రాల రెక్కలు విప్పుకొని హాయిగా ఎగరొచ్చు.



-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

### ఖబడ్దార్

ఖబడ్దార్... ఖబడ్దార్
సోయి పోయి చేయి కలపకు
ఆశపడి ఆలింగనం చేయకు
చుట్టూ చూసి తుమ్మమంది
దూరం జరిగి దగ్గమంది.

ఎన్ని చెప్పినా వినరాయే
ఏమి చేసినా కనరాయే
లక్ష్య పెట్టేవారు లేకపాయే
అందుకే నేను ఉన్న
నేను ఉన్న మీవెంటే
నేనుంటా మీ చెంతే
అంటూ తోడు వచ్చే స్ట్రైన్
ఎంతటి వారికి అయినా
తప్పదంట పెయిన్
ఖబడ్దార్... ఖబడ్దార్.

ఈ విశ్వమంతా తనకి
ప్లే గ్రౌండే... తన ఆటలో
అందరూ ఆటగాళ్ళే

జాతి మతం చూడదంట
ఆడ...మగ లేదంట
నలుపైనా...తెలుపైనా
పొట్టి..పొడుగు తేడాలేదు
ఇరుగు పొరుగు ఊసు లేదు
అయినోళ్ళని అసలే లేదు
ఈ ఆటలో గెలిచి ఓడేదెవ్వరో
ఓడి గెలిచేదెవ్వరో...
ఖబడ్దార్...ఖబడ్దార్
వాక్సిన్ వచ్చింది అని
మురిసిపోవద్దు
పదిమందితో కూడి
సంబరాలు చేయద్దు
ఖబడ్దార్... ఖబడ్దార్.

ప్రతి నిమిషం ఒక హెచ్చరిక
దూరం దూరం అంటూ
ఒక మేల్కొలుపు
లేకుంటే ఇదే మీకు
ఆఖరి మలుపు అంటూ
హితవు పలుకుతోంది
మన చుట్టూనే ఉన్న
మృత్యు ఘోష...
ఖబడ్దార్... ఖబడ్దార్.



-కల్యాణి కొండూరు
+9746615944

### ఆమని పర్వం

వసంత ఋతువులో
ఆమని రాకతో
కోయిలల కుహూ కుహూలు
పక్షుల కిలకిలరావాలు
ప్రకృతికి మేలుకొలుపుగా
మావి చిగుళ్ళు
ముంగురుల సవరింపుగా
రంగు రంగుల పూల పూతలు
భువికి రంగులద్దినట్టుగా
పెరిగే సూర్య తాపం
వెచ్చని దుప్పటిగా
మారే కాలమానం
వసంత రాగంగా
ఆమని పర్వం ఉగాది
తెలుగువారి కొత్త సంవత్సరాది,
శ్రీ ప్లవ నామ సంవత్సరం
జ్ఞానం,తెలివితో కరోనా కట్టడి లో
బతుకు నేర్పి,విజయాన్ని కలిగించాలి
ఈ కొత్త సంవత్సరానికి
హార్దిక స్వాగతం పలుకుతూ
జీవితానుభవాల సారమే
ఉగాది పచ్చడి షడ్రుచులుగా
ఆస్వాదించాలి



-సంధ్య సుత్రావె
9177615967


ఈనెల 9న జరిగిన యస్వీ కృష్ణ జయంతి
యస్వీ కృష్ణల "మరీచిక" "ముఖచిత్రం" కవితా సంపుటిల ఆవిష్కరణల సభలో ఛార్మిళవెంకట్, కృతిరెడ్డి, ఆధ్యాతేజోమూర్తుల, గగన్‌వెంకట్, విజయ కీర్తిలచే కూచిపూడి నృత్యప్రదర్శన చేసిన కళాకారులను సన్మానిస్తున్న అతిథులు యస్వీ కృష్ణ, మౌనశ్రీ మల్లిక్, బైస దేవదాసు, చొక్కాపు వెంకటరమణ, యస్వీ కృష్ణ జయంతి , డా॥ అర్ధనారీశ్వరం వెంకట్.











మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 189వ రోజు 'పోస్టాఫీసు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'పోస్టాఫీసు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. – సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక &
దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
**దాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు**, 9441046839

## కరుణాంతరంగిణి

ఆనాడు
సంతోషాలను సరదాలను
కడుపులో దాచుకుని
మన కందించిన సంధానకర్త.
కొందరి ఇళ్ళల్లో నువ్వుల కేరింతలు
కొందరి మనస్సులో
దుఃఖాశ్రువులు చిందించి
గెలుపోటములు సహజమని
కష్టసుఖాలు కావడి కుండలని
జీవిత పరమార్థం తెలిపిన దిక్సూచి.
ఆపదలో ఆనందంలో
సమాచారాన్ని పంపి
నేనున్నానని అదుకొని
అపన్న హస్తం అందించిన
కరుణాంతరంగిణి.
నేడు
రూపు మార్చుకుని
మారుతున్న కాలానికనుగుణంగా
వ్యాపార పంథాలో
పయనిస్తున్న
సెలబ్రిటీ



**– కపిలవాయి అశోక్ బాబు,**
87907 27772

## నమ్మకానికి అమ్మ

శతాబ్దాల చరిత్ర గల
తపాలా శాఖ
బ్యాంకులకు సమాంతరంగా
సేవలందిస్తున్న తపాలా కార్యాలయం
నేడు అస్తిత్వాన్ని కోల్పోయే స్థితిలో!!.
తపాలాతో తపాలా బంట్రోతుతో
ఎనలేని అనుబంధం
తిలక్ కవితల్లో కూడా
చోటు దక్కిన పోస్ట్ మాన్!!.
శ్రీరాం భీకాజీ వేలంకార్
సృష్టించిన అద్భుతం
పిన్ కోడ్ వ్యవస్థ
ఒక సంచలనం!!.
మాయలపకీరు సంచిలోంచి
తీసినట్లు
ఎన్నెన్నో పథకాలు
సేవింగ్ బ్యాంక్ ఖాతాలు
ఫిక్సుడు డిపాజిట్లు
సీనియర్ సిటిజన్ ఖాతాలు
చిన్న మొత్తాల పొదుపులు
ఎన్ని అద్భుత పథకాలు తెచ్చినా
పోస్టాఫీసంటే చిన్నచూపు...
ఆధునికత దిశగా
నత్త నడక నడుస్తున్నపోస్టాఫీసు
సంప్రదాయవాదానికి
ప్రతీకగా కనిపిస్తుంది!!.
అప్పట్లో
సర్వీస్ కమిషన్ దరఖాస్తులు
ఆర్డినరీ పోస్టులోనే పంపాలనే షరతు చూస్తే
మరి తపాలా శాఖ
నమ్మకానికి అమ్మవంటిదే!!
కానీ నేడు...
చరవాణి అంతర్జాలం రాకతో
సమాంతర కొరియర్ సర్వీసుల మోతతో
బస్తాలకొద్దీ ఉత్తరాలు
మోసుకొచ్చే పోస్ట్ మ్యాన్
ట్రింగ్ ట్రింగ్ సైకిల్ మోత
క్రమంగా దూరం
తోకలేని పిట్ట
ఏ దిక్కుకో వెళ్ళిపోయింది!!.
ఆడియోలు వీడియోలు రాజ్యమేలుతున్న వేళ
ఉత్తరం రాసి
జవాబుకై ఎదురుచూసే
ఉత్కంఠ క్షణాలు
ఆవిరైపోయాయి
అయినా
నమ్మకానికి అసలయిన చిరునామా
ఎప్పటికీ తపాలా కార్యాలయమే!!



**– పరిమి వెంకట సత్యమూర్తి,**
9440720324

## ఈ రోజు వాటికి పనితక్కువే

మునుపటి కాలంలో
పోస్టాఫీసులో పని ఎక్కువ
ఇప్పుడు కొత్త పనుల వేటలో
కాలం మార్పు
ఉత్తరాలతో పనిలేక చరవాణి ఆగమనం
మనియార్డరుతో పనిలేక
గూగుల్ పే ఫోన్ పే ఎటిమ్ కార్డులు .
పోస్ట్ డబ్బాలో ఉత్తరాలు శూన్యం
పోస్ట్ మ్యాన్ పని మటుమాయం
వాట్సాప్ వచ్చి
సమాచార బదలాయింపు సులభతరం
పంపించే లేఖలు లేక పోస్టాపీసు దీనావస్థ
సమాచార వాహకం
పెన్షన్ల పంపిణీ కేంద్రం
ఉత్తరాల స్థానంలో సొమ్ముల పంపిణీ
మారిన పనుల తీరు
ఆధునిక కాలానికి తగ్గట్టు
సేవల మార్పిడి



**–వి. సంధ్యా రాణి,**
9542299500

## మూడు కేకలు మూడు లేఖలు

పోస్ట్.....
మొదటి కేక
మొదటిలేఖ
మిలిటరిలోవున్న భర్త నుండి
భార్యకు అందిన ప్రేమలేఖ.
ఆమె ముఖమంతా
ఏడు రంగుల ఇంద్రధనుస్సయింది
హృదయం ఆనందంతో ఉప్పొంగింది
మనసంతా పులకింత
భర్త దూరాన మంచుకొండల్లో
గుర్తుకురాని రోజంటూ లేదు
కలిసి కాపురం చేసిన కొద్ది రోజుల్ని
ఆ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసే
ఆ ఉత్తరం
భర్తనుండి రాగానే
ఆమె కళ్ళల్లో నీళ్లు
అవి కన్నీళ్లు కావు– ఆనందబాష్పాలు
పోస్ట్... పోస్ట్...
రెండవ కేక
రెండవ లేఖ
మిలిటరిలోవున్న కొడుకు నుండి
తల్లిదండ్రులకు అందిన మనియార్డర్
డబ్బు అందగానే వారి ఆనందం
వర్ణణాతీతం అది అనుభవైకవేద్యం
తాము కష్టపడి చదివించినందుకు
తాము కన్న కలలు సాకారమైనందుకు
తమ బిడ్డ గొప్ప ప్రయోజకుడైనందుకు
కన్నవారిని మరువక
నెలనెలా మనియార్డర్ ను పంపుతున్నందుకు
మంచి బిడ్డనే కన్నారని పదిమంది అన్నారని
ఆ తల్లిదండ్రుల కళ్లల్లో నీళ్లు
అవి కన్నీళ్లు కావు– ఆనందబాష్పాలు"
పోస్ట్... పోస్ట్... పోస్ట్...
మూడవ కేక
మూడవ లేఖ
మిలిటరి నుండి అందిన టెలిగ్రామ్
కుటుంబానికి అది విషాదకరవార్త
అది అందుకునే ముందు
భార్య చేతులు భయంతో వణికాయి
అది మంచుకొండల నుండి వచ్చిన
మరణవార్త
ఇంటి దీపమైన ఒక్కగానొక్క కొడుకు
దేశసరిహద్దుల్లో శత్రువులతో పోరాటంలో
వీరమరణం పొందాడన్న విషాదకరవార్త
కడుపుతో వున్న భార్య కాలికింద
భూమి కదిలింది
ముసలి తల్లిదండ్రుల
గుండెలు ముక్కలయ్యాయి
కుటుంబం కుమిలిపోయింది
ఊరంతా ఉలిక్కి పడింది
అందరి కళ్లల్లో కన్నీరే .
ఏ చేతితో ప్రేమలేఖను అందించానో
ఏ చేతితో మనియార్డర్ అందించానో
అదే చేతితో మరణవార్తనందించానంటూ
కుమిలి కుమిలి ఏడ్చాడు–
'పాపం పోస్టు మ్యాన్'



**–పోలయ్య కూకట్లపల్లి**
9110784502

## లేఖల భవనం

మధుర భావాల
ఎన్నో స్వప్నాల భవనం
ఓ చిన్న కార్డు
ఎన్నో సుందర అనుభూతుల్ని తెస్తుంది.
ఓ ఇన్లాండ్ కవరు
ఎన్నో అంశాలు సూక్తులు
జీవిత సత్యాలను తెస్తుంది.
ఒక కవర్
ఎన్నో కధలు
కబుర్లు కవితలు నవలలు
రాశిగా తెస్తుంది.
అతి తక్కువ ఖర్చుతో
విభిన్న సమాచారాలు తెచ్చి
అనుభూతుల్లో నింపుతుంది.
మనియర్డర్లు ఇచ్చే పోస్ట్ మాన్
కోసం ఎన్నో కళ్ల వెతుకులాట
ప్రతి నెల పోస్ట్ అంకుల్ తెచ్చే డబ్బులతో
చదువుకునే విద్యార్థులందరూ
ఆశగా ఎదురు చూపులు
అవన్నీ నేడు మరుగున పడ్డాయి
అడవి గాచిన వెన్నెలగా మిగిలింది
లేఖారచన ఒక కళ
ఆరోజు లే వేరు
ఒడియో టీవీ అన్నిటికీ లేఖల అభిప్రాయాలు
ఇపుడవన్నీ మరపు రాని అనుభూతులే



**–నారుమంచి వాణి ప్రభాకరి,**
9849481823

## బహుళ ప్రయోజనాల కేంద్రాలు

ఊరి మధ్యలో ఒక గోడకు
వేలాడే పోస్ట్ డబ్బా
మదినిండా జ్ఞాపకాల ఊటలు
సైకిల్ బెల్ కొడుతూ
పోస్ట్ పోస్ట్ అని అరుస్తూ
పోస్టుమాన్ ఇచ్చే ఉత్తరం వస్తే ఆనందం
నేటి తరానికి పోస్ట్ కార్డ్ మాయం
బుర్రు బుర్రు పిట్ట– తోకలేని పిట్ట
ఊరంతా తిరిగే పొదుపు కథ గుర్తుకొస్తుంది
దుబాయి మస్కట్ ల నుంచి మనియార్డర్లు
రాసే ఉత్తరాలు నెలల కొద్ది
జ్ఞాపకంగా నెమరు ఏసుకునే వాళ్ళం
దూరం బంధువులకు శుభ లేఖలు
అత్యవసర పరిస్థితుల్లో
ఆపత్కాల మైత్రి మన పోస్టు ఆఫీస్
కాల చక్రంలో మతలబులు ఎన్నో
నేడు ప్రభుత్వ పెన్షన్ లు
అందించి తోడ్పాటు కేంద్రాలు
కేంద్ర రాష్ట్ర పథకాల అమలు వారధి
బాంక్ ల ఎ.టి.ఎం లు
కిసాన్ వికాస్ పత్రాలు
సుకన్య యోజన
పాస్ పోర్ట్ దరఖాస్తు కేంద్రం
బహుళ ప్రయోజనాల
ఆర్థిక అభివృద్ధిలో
లక్ష్మి కేంద్రాలు



**– శేషారావు,**
9440408080

## బట్వాడా కేంద్రం

పోస్టాఫీస్ అంటేనే ఉత్తరాలు
మనీ ఆర్డర్లు పార్సిళ్ల బట్వాడా కేంద్రం
చిన్న మొత్తాల పొదుపు కేంద్రం కూడా
స్మార్ట్ ఫోన్స్ వచ్చాక
పోస్టాఫీస్ సేవలను
అతి తక్కువగా వినియోగించుకుంటున్నాం
నేటి తరానికి ఉత్తరాలు,
టెలిగ్రామ్స్ అంటే కూడా
తెలియని దుస్థితి
గతంలో ఉత్తరాలు తెచ్చే పోస్టుమాన్ కోసం
గుమ్మాలలో ఎదురుచూపులు
చదువడం రాకుంటే
వారితోనే చదివించుకోవడం
పట్నంలో ఉండి చదువుకొనే పిల్లలు
తండ్రి పంపే మనియార్డరుకై
ఎదురు చూడలేక
ఆత్రుతతో పోస్టాఫీస్ దాకా వెళ్లి
వాకబు చేయడం
మెరిసే కళ్ళతో డబ్బు తీసుకోవడం
స్మార్ట్ ఫోన్లు కాదు గదా
మామూలు ఫోన్లే
ఊరుకొక్కటి లేనప్పుడు
ఉన్న ఒక్కటీ రెండూ కూడా
భూస్వాముల, మోతుబరుల ఇండ్లలో ఉండి
సామాన్యులకు అవకాశం దొరకనప్పుడు
వారం పది రోజులకు చేరినా
పోస్టాఫీస్ నుండి వచ్చే ఉత్తరాలే దిక్కు
మరీ అర్జెంటయితే మనిషిని పంపడం
మినహా
ఇంకో దారిలేదు
పంపక తప్పేది కాదు
అది కూడా అసలే బస్సులు లేని ఊర్లకు
బస్సులు ఒక్కసారే వచ్చి పోయే ఊళ్లకు
కాలుకు పని చెప్పక తప్పని కాలం
కష్టమనకుండా వెళ్లి వార్తలు చేరవేసే మార్గం



**– నాగిరెడ్డి అరుణ జ్యోతి,**
9966180561

## బంధాల వారధి

స్టాంపులూ కార్డులూ కవర్లు అమ్మే
డబ్బు దాచుకుని తీసుకుని
పార్శిలు స్పీడ్ పోస్ట్ సదుపాయాల భవంతి
ప్రాంతాల వారీగా లేఖలు
బుక్ పోస్టు స్పీడ్ పోస్ట్ కట్టలతో
పరుగులు తీసే పోస్ట్ మెన్
వెరసి బంధాల వారధి
పల్లె పల్లెలో పోస్టాఫీసు
ప్రభుత్వ పథకాలకి ప్రజాక్షేమ
సహాయ సహకార బిందువు!
పదిహేడవ శతాబ్దిలో ఆరంభం
రెండో ఛార్లెస్ ఇంగ్లాండులో
నెలకొల్పిన జి.పి.ఓ
హెన్రీబిషప్ పోస్ట్ మార్క్
సర్.రౌలండ్హిల్ స్టాంపు ఆవిష్కరణ
పెన్నీ బ్లాక్ తపాలాబిళ్ల
తొలి ప్రపంచ స్టాంపు!
భారత్ లో ఈస్టిండియా కంపెనీ
వర్తక వాణిజ్యానికి
బొంబాయి మద్రాసు కలకత్తాలలో
లార్డ్ డల్హౌసీ తపాలాకార్యాలయ విస్తరణ
స్వతంత్ర భారతంలో
తిప్పతీగలా అల్లుకున్న
తపాలాశాఖ డాక్ భవన్ ఢిల్లీ
హైదరాబాద్ జి.పి.ఓ. సేవలు అమోఘం!
ఖర్చు తక్కువ
త్వరగా ఖచ్చితంగా పార్శిల్ స్పీడ్ పోస్ట్
చేరికకు భరోసా
తపాలా బిళ్లల ప్రదర్శనలు వీక్షించాలి
పిల్లలకి చూపి ప్రోత్సహించాలి
పోస్టాఫీసు పై అవగాహన కల్పించాలి...

**–ఎ.రాజ్యశ్రీ,**
9390864067

## పల్లె సేవకు పట్టాభిషేకం

సామాన్యునికి అందుబాటులోని
ఆత్మీయ బంధువు
మనిషిని మనిషిని కలిపే ఉత్తరాల వారధి
మనసులోని భావాలను
పెట్టెలో పెట్టి వేల మైళ్ళ దూరం మోసుకెళ్ళి
ఆశగా ఎదురు చూస్తున్న హృదయాన్ని
ఆనంద పరవశం చేసే కార్యాలయం
ఎక్కడో దూరంగా చదువుకునే విద్యార్థులకు
మనీ ఆర్డర్ పంపుతూ
చదువులకు బాసటగా నిలిచిన భవనం
టెలిఫోన్ వచ్చిన మొదట్లో
మనుషులను ఆత్మీయంగా పలకరించిన
దూరవాణి కేంద్రం
మనిషికి పొదుపును అలవరిచే నేర్పరి
చిన్న మొత్తాల పొదుపుతో
భవితకు భరోసా ఇచ్చిన సంస్థ.
శుభవార్తలైనా చేదు వార్త లయినా
సమానంగా స్వీకరిస్తూ
ఇంటి గడపను చేర్చే వాహక కార్యాలయం
వార పక్ష మాస పత్రికలను పంచుతూ
ఎందరికో విజ్ఞాన సర్వస్వాన్ని పంచిన
జ్ఞాన రూపం
దేశ సేవలో పునీతులైన
నాయకులను స్మరిస్తూ
వారి చిత్రాలను ప్రచురించే జ్ఞాపకాల నిధి
పల్లె పల్లెను దేశంతో అనుసంధానించిన
సమాచార వారధి
కాలంతో పాటు అనేక మార్పులు పొంది
నేనున్నానంటూ సేవలందిస్తున్న
తపాలా కార్యాలయం



**–త్రివిక్రమ శర్మ,**
9000392707




## నారద ముని వారసత్వం

ఆ. వె. కాలినడకతిరిగి కబురులమోసేటి
చిలుకమారుబంటుచెలిమికాడు
తంతిదేవళంపుదైవమ్మబంట్రోతు
నారద ముని పోస్టువారసుండు.
తే.గీ. పొదుపు ఇన్లాండు లెటరుతో పోస్టు కార్డు
కవరు పార్సిలు,టెలిగ్రాము కథలబుక్కు
ఫోను ట్రంకాలు బుక్కింగు స్థానమందు
ఎర్రా డబ్బావిలాసమ్ము నేగె దివికి.
తే.గీ. చావు పుట్టుక ముచ్చట స్థలము పోస్టు
పొదుపు నదుపును పంచెడుకుదురు గుంజ
పదిలమై మనియార్డరు పంపు బ్యాంకు
శిథిల భవనమై నిర్మించెను చేటు కలిగి!!.
కం. ఈకలు పీకిన కోడిగ
ప్రాకటముగ నెట్టు ముందు పగిలిన తలతో
చీకటి భవితకు కీడై
భూకంపమువలనచెడెను పోస్టాఫీసులే!!.
ఉ. నవ్యత సంతరించుకొననాణ్యపు సేవల కొత్త భావనల్
సవ్యపు చిన్న మొత్తముల సంగడి పోస్టుగనీతరమ్ములో
దివ్య విశేష మార్గముల దిద్దిరి నేడది స్పీడు పోస్టుగా
భవ్య విలాసమై పుడమిబాగయిశ్రీ పథకాలకేంద్రమై!!



**–మాడుగుల నారాయణ మూర్తి,**
94411 39106

## ఉగాది పురస్కారాల ప్రదానం



సృజన ఆర్ట్ క్రియేషన్స్ సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పురస్కారాలను 2021 ప్రదానం చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారికి ఈ పురస్కారాలను ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, సంఘ సేవకులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ప్రదానం చేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న డాక్టర్ రేగొండ నరేష్, డాక్టర్ సుద్దాల రాజమౌళి, బి. బ్రహ్మానందం, డాక్టర్ రవికుమార్, తుమ్మల సిగ్గ మాధవి, కె. సిద్దప్ప, కె.అనిల్‌కుమార్, ఎల్. నరేందర్, ఎం.జె. జంగయ్య, డాక్టర్ జగదీష్, డాక్టర్ అలూరి విల్సన్, టి. అన్వేష్‌చారి, డాక్టర్ కె. ఝాన్సీరాణి, పి. గీతానాయుడు, వై.విజయలక్ష్మి, డాక్టర్ సురభి లక్ష్మీశారద, ఎం. రమణాచారి, తేజ, కామేష్, డాక్టర్ మల్లేమాల వెంకటరమణ, తదితరులకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి రాజేష్, సీనియర్ జర్నలిస్టు మనోహర్ పాల్గొన్నారు.

### లలితాకళాభారతి ఉగాది పురస్కారాలు

కమలాకర్ లలిత కళాభారతి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం సాయంత్రం త్యాగరాయ గానసభలో ఆ సంస్థ అధినేత్రి భారతికమలాకర్ ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ మానవహక్కుల కమీషన్ ఛైర్మన్ వెంకటస్వామి నాయుడు, స్మార్థ పండితులు మేడిచర్ల శ్రీహరికృష్ణశర్మ, ఛేంజ్‌మేకర్‌గా మారిన ఇంజనీర్ నాగరాజు కౌముదిలకు ప్రదానం చేసి సత్కరించారు. సభకు ఉస్మానియా యూనివర్శిటీ సహాయ ఆచార్యులు సాగి కమలాకారశర్మ అధ్యక్షత వహించగా ఆచార్య టి. గౌరిశంకర్, సినీ నటులు రవికిరణ్ పాల్గొన్నారు. అంతకుముందు కవిసమ్మేళనం జరిగింది.

## గొప్ప సాహితీవేత్త బిరుదురాజు రామరాజు


బిరుదురాజు రామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు.

జానపద సాహిత్యంపై కృషి చేసిన గొప్ప సాహితీవేత్త బిరుదురాజు రామరాజు అని మల్కాజ్‌గిరి కోర్టు న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శుక్రవారం బిరుదురాజు రామరాజు జయంతి సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. జానపద విజ్ఞాన పరిశోధకుడిగా బిరుదులు విశేషంగా సేవలందించారని బూర్గుల మధుసూదన్ కొనియాడారు. ఆయన రచనలు విశేషంగా ప్రాచుర్యం పొందాయన్నారు. కార్యక్రమంలో సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, సంఘసేవకుడు ఏవీఆర్ మూర్తి, తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఎస్.శ్రీవాణి, గానసభ పాలకమండలి సభ్యురాలు లతావర్మ పాల్గొన్నారు.

## మాయ రోగం

కరోనా! కరోనా!
నైరోనా! నైరోనా
కర్రెగుంటదో, ఎర్రగుంటదో!
తెల్లగుంటదో, నల్లగుంటదో!
రంగు రూపం లేదంటది
టింగురంగని అంటుకుంటది!
పల్లెనుండి పట్నం వరకు
ప్రజలందరినీ పట్టి పీడిస్తుంది!
అగ్రరాజ్యాల సైతం
హడలెత్తిస్తుంది!
సప్త సముద్రాలను
అవలీలగ దాటెస్తుంది
దావాగ్నిల జూసి జడసలేదు
కార్చిచ్చును జూసి కన్నీరు బెట్టదు!
మహమ్మారి మాయరోగం
దాని పేరు వింటేనే
ఒడలంత జలదరింపు
బడులన్నీ మూయించింది!
విమానలన్నీ రద్దుజేసింది!
ప్రయాణాలన్నీ ఆపేసింది!
ఎక్కడి దొంగలు అక్కడనే
గప్‌చిప్ 'కరోనా'తో ఖాముష్
దగ్గు దగ్గిందంటే
తుమ్ము తుమ్మిందంటే
పడిశముబట్టిన
పగవానిలాగ చూడటమాయె!
ఆత్మీయులను విడదీసింది
ఆలింగమునకు దూరమన్నది
చేతిలో చెయ్యికలిపేది లేదు
మనిషి మనిషిని తాకేది లేదు
మందు మాకులు లేకపాయె!
నివారణయే మేలని భోధనలాయె!
మాటి మాటికి నీరు తాగమన్నది
సబ్బుతో చేతులు కడగమన్నది
నిత్యం స్నానం చేయమన్నది
ఇల్లంత శుభ్రత పాటింపమన్నది
ముక్కుకు మూతికి గుడ్డ కప్పమన్నది
ఎక్కడబడితే అక్కడ చీదగూడదన్నది
పదిమందిలో తిరగవద్దన్నది
అందరం కలిసి పాటిద్దాం!
తొందరలోనే తరిమేద్దాం!



**– ఎం.ఎ.గఫార్**
సెల్: 9490324834

## సాగిపోయే కాలం

కాల ప్రవాహమెప్పుడు ఒకేలా పారదు
జీవిత ప్రయాణమెప్పుడూ ఒకేలా సాగదు!
తీపి, పులుపుల రుచి మరిగిన నోరు
కారం, చేదు, వగరు జోలుకు పొమ్మన్నా పోదు.

మోడిబారిన చెట్టు
మళ్ళీ చిగురించకా మానదన్నట్టు–
తుఫాను రాత్రి నుండి బైటపడ్డ ప్రకృతి
కొత్త ఉషోదయపు కాంతులతో
తెలతెల్లవారకా మానదు.

కరోనా కాటుతో తల్లడిల్లిన ప్రపంచం
మానవత్వపు కళ్ళుతెరిపించి
వేపపూవులాంటి ఔషధంతో కసిదీరా
వ్యాధినిరోధకాశక్తినీ పెంచిందీ చూడలేదూ!

బాధలున్న చోట ఆనందమూ పొంచి ఉన్నట్లు
కష్టాల సుడిగుండాలున్నచోట
సుఖాల ఊతలూ సృష్టింపబడతాయి
సుఖాల ఊతలూ నవఉగాదులకు శ్రీకారమేగాని
ఫీంకార తాటాకు చప్పుళ్ళకు ఆగేదీ కాదు
కాలమెప్పుడూ సాగిపోవడమేగాని
ఎవరాగమన్నా ఆగదు!
మనిషి అభివృద్ధినీ ఎవరు ఆపాలన్నా
తాత్కాలికమేగాని
శాశ్వతం మాత్రం ఏమాత్రం
కాదుగాక కాదు!!



**– చలపాక ప్రకాశ్**
సెల్: 9247475975

పుస్తక సమీక్ష

# పచ్చని సంతకం - పచ్చబొట్టు కవిత్వం

వృక్షశాస్త్రంలో స్నాతకోత్తర విద్యను పూ ర్తిచేసి ప్రకృతికి నిండుదనం ప్రసాదించే వనాలను రక్షించడానికి అటవీక్షేత్రాధికారిగా ఉద్యోగంలోచేరి ఉపసంరక్షణాధికారిగా, ఐ.యఫ్.యస్., అధికారిగా వివిధ హోదాలలో 35 సంవత్సరాలపాటు శత శాతం నిబద్ధ సేవలను అందించిన దాసరి నాగభూషణం పదవీ విరమణానంతరం కూడా అదే నిబద్ధతతో అడవులు విధ్వంసం కాకుండా ఉండాలని పరిసర ప్రకృతి అటవి సంపద నిరంతరం పచ్చదనంతో పరిఢవిల్లాలని పరితపిస్తూ పచ్చదనాల కవితలు రాసి ఈ మధ్యే ప్రచురించిన పుస్తకం 'పచ్చబొట్టు'.

వీరు 2015 లో అటవీసంరక్షణలో ప్రాణాలు అర్పించిన అమరులైన అటవీ ఉద్యోగులపై వ్రాసిన కవితలతో 'పచ్చమందారాలు' పుస్తకాన్ని ప్రచురించారు. చిన్నతనం నుండే చిత్రకారుడిగా ప్రకృతిపైనా, సామాజిక జీవనం పైనా అద్భుతంగా బొమ్మలు గీస్తూ పరిణిత యువకుడిగా సాహిత్య దోస్తానా చేస్తూ ప్రశాంతగంభీర వ్యక్తిత్వంతో ఎదిగిన వ్యక్తి కవి దాసరి నాగభూషణం. 'చిలుక ముక్కున తియ్యని జాంపండు/ పక్షుల కిలకిలలు వీనుల విందు గుండు' అంటూ అరణ్యానికి సంక్షిప్తచిత్రం (ఓతినితిజీబిబీతీవ) వంటి 'స్వాగతారణ్య మాలిక' అన్న ప్రారంభ కవితతో తన 'పచ్చబొట్టు'. కవితాప్రాంగణంలోకి స్వాగతం పలికాడు కవి. 'అవని ఆకాశం మధ్య' కవితలో చెట్టు మనిషికి రకరకాలుగా ఉపయోగ పడే తీరును వర్ణిస్తూ 'దహన సంస్కారాల సంస్కారమై' చివరికి పిడికెడు బూడిదైన చెట్టు అవనిపై ఆకాశమంత ఎత్తు అంటాడు. 'అడవితల్లి అందాలు' లో అడవితల్లి అందాల సింధువును తన ఒక్క కవితలో ఒదిగించి వందనం చేస్తూ 'నీకు నిత్య పాదాభివందనం' ఆ తల్లికి మోకరిల్లుతాడు. "మీ అమ్మను నేను' కవితలో మట్టి విశ్వరూపాన్ని, 'త్యాగమూర్తి' కవితలో విత్తనం మహా వృక్షంగా ఎదిగే తీరును వర్ణిస్తాడు. "మానవుడి సేవలో నిలువెత్తుగా నిలబడ్డ/ నిస్వార్థజీవి ఈ మహావృక్షం" అని అభివర్ణిస్తాడు.

'ప్రకృతి నైజం' కవితలో రక్షించే చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేస్తే – వర్షాలు లేక పంటలు పండవనీ, ఉష్ణోగ్రతలు పెరిగి సముద్రాలు ఉప్పొంగుతాయనీ, కరువూ కాటకాలకూ ఈలోకం నిలయమవుతుందనీ, ప్రగతి శిథిలమై అంధకారమౌను భవితవ్యం' అని కవి హెచ్చరిస్తాడు.

'కావాలనే కోరిక' లో కవి తని అభిమతాలను వెల్లడిస్తూ 'అడగకుండా అన్నింటినందించు/ అడవితల్లి అనురాగవల్లి/ పాదములు తాకి తన్మయమొందే/ పదధూళిని నే నవ్వాలని' అనే కోరికను వెల్లడిస్తాడు.

సమకాలీన సంఘటనలకు స్పందిస్తూ– వయసుడిగిన మర్రి జాతి వృక్షాలను ట్రాన్స్ లొకేషన్ చేసిన సందర్భంలో ట్రాన్స్ లొకేషన్ జోధ్ పూర్ ఉమైద్ ఆసుపత్రిలో జరిగిన దారుణానికి స్పందిస్తూ 'బిగుసుకున్న పిడికిలి', కాగజ్ నగర్ అటవీ క్షేత్రాధికారిణి, ఆమె సిబ్బందిపై జరిగిన దాడిని నిరసిస్తూ 'పైశాచికం' మరియు పసిప్రాయపు అమ్మాయిపై జరిగిన అత్యాచారానికి కలిగిన వేదనతో 'అమీషా! అమీషా!! 'అన్న కవితలను వ్రాశాడు. 'వెదురు సంస్కృతి' కవితలో వెదురు ప్రయోజనాలనూ, 'చిరంజీవి' అనే చిట్టి కవితలో "మనిషి మరుగై పోయినా/ నిలువ నీడకు గుర్తుగా/ పక్షుల పొదరిల్లుగా/ జీవరాశులకు ప్రాణవాయువుగా'' నిలిచే చెట్టు గురించీ,' నీళ్ళయుద్ధాలు' కవితలో నీళ్ళ లభ్యత గురించి గతానికీ, ఇప్పటికీ తేడా చెబుతూ భవిష్యత్తులో నీటి యుద్ధాలు జరుగుతా యని చెబుతాడు.

'నిత్యాన్నదాత' లో రైతు గురించీ ''భవిష్యత్తు ఇచ్చిన అమ్మ'' లో అనురాగమయి అమ్మ గురించీ "ఎంత ఎలుగు ఎన్నీలోలె'' కవితలో మూగజీవాలైన బర్రె, దూడల ఆత్మీయ బంధం గురించీ, 'పెద్దిర్కం' కవితలో వెర్రితలలు వేస్తున్న యువతరం వేషాధారణ గురించీ 'ఎందుకు?' కవితలో సృష్టిలోని విభిన్న వైరుధ్యాల గురించి, 'మల్టీ డైమెన్షనల్ కల్తీ' లో లోకంలో జరుగుతున్న రకరకాల కల్తీ గురించి చక్కగా వర్ణిస్తాడు. 'నీ కాళ్ళ కసరత్తు శ్రమకు నీ చేతుల రూపచిత్రణకు/ నీ స్వేదానికి సర్వదా శిరసువంచి చేస్తున్నాను వందనం' అంటూ కుమ్మరన్నకు నమస్కరిస్తాడు.

కవి దాసరి నాగభూషణం చిత్రకారుడు కూడా కాబట్టి కవితలను అద్భుత చిత్రమాలికలుగా రూపొందిస్తాడు.

'అమ్మచేసిన సార్గం' లో అమ్మ గృహవైద్యంచేసి పిల్లలను ఆదుకున్న తీరు గురించి, పసితనపు స్నేహ పరిమళాలు' లో తాను చదుకున్న పాఠశాల క్రమశిక్షణాయుత క్లాసులనూ, ఆనాటి స్నేహ పరిమళాలనూ కళ్ళముందు నిలబెడతాడు. "బాపవ్వ బొడ్లో పెయ్యినంటుకొని యెప్పుడూ/ కళ కళలాడుతూ కనుల కింపుగా/ రంగురంగుల కొత్త బట్ట పేల్కలతో కుట్టిన అతుకుల సంచిని వర్ణిస్తూ, తమల పాకులూ, కాసూ సున్నం, బాగం వక్కా వగైరాలను భద్రపరచడానికి ఆ చిన్న సంచీలోనే ఎన్నో అరలు ఉంటాయని అంటూ 'పరేషాన్లన్నింటికీ ఉపశమనం/ సమస్తాన్ని మూటగట్టుకున్న/ హారేక్మాల్ మంత్రదండం/ బాపవ్వ బొడ్లోనున్న సంచి ఇచిసిత్రం"అనే సవివర అద్భుత చిత్రం 'బాపవ్వబొడ్లో సంచి' కవిత. ఇట్లాంటి చిత్రకవితే 'ఇనుప సందూకు పెట్టె'.

ఇక పదవీ విరమణ కవితలో కవి ఇన్ని రోజులుగా ఇంట్లో ఏ బంధాలూ, అనుబంధాలు చెదరిపోకుండా నేర్పుతో చూసుకున్న జీవిత భాగస్వామిని ప్రశంసిస్తూ 'గుణితాల కందని ఆమె సేవలకు ఏమని విలువ కట్టాలి? అని ప్రశ్నించుకుంటూ 'ఈ నా శేష జీవితమంతా నేనే తను కావడం తప్ప' అంటూ సమాధానం చెప్పుకుంటాడు.

నన్ను వదిలిపోయినా/నిత్యం నా ఆలోచనల్లో కదలాడుతూ/ నా మది గోడకు నిత్యం వ్రేలాడుతూ/ సదా నా క్షేమం కోరే/ వారి చెదిరిపోని రూపాలకు/ కృతజ్ఞతల వందనాలు' అంటూ 'కృతజ్ఞతలు' అనే కవితతో 'పచ్చబొట్టు' కవిత్వం పుస్తకాన్నిముగిస్తాడు కవి.

ఈ "పచ్చబొట్టు" లో మామూలు ప్రజల భాష యాసనూ కలగలుపుకొని కవిత్వ భాషనూ మేలవించి అల్లిన ప్రకృతి పచ్చదనాల, వివిధ సంఘటనల, పండగల, జీవిత వివిధ కోణాలనూ స్పర్శించిన, సంస్మరణలకు సంబంధించిన మొత్తం 140 కవితలున్నాయి. భావాత్మకంగా కవి స్వీయంగా గీసుకున్న ఆకర్షణీయమైన ముఖచిత్రంతో వెలువడిన అందరూ చదవదగిన పుస్తకమిది.






పుస్తకం వెల రూ. 100/–, పేజీలు: 162, ప్రతులకు
రచయిత: దాసరి నాగభూషణం
ఇ.నెం.11–13/109/1
ఇందియా రెసిడెన్సీ, ఫ్లాట్ నెం. 401
కొత్తపేట, అష్టలక్ష్మి టెంపుల్
రోడ్ నెం.1/ఎ, హైదరాబాద్–500 015
సెల్:8096511200 .



**–రఘువర్మ**
92900 93933

